క్లుప్తంగా

ఘనంగా శ్రీయాజ్ఞవల్క్య జయంతి

నిడదవోలు రూరల్: పట్టణంలోని చిన కాశీ రేవు ఒడ్డున గల సూర్య శ్రీయాజ్ఞవల్క్య ఆంజనేయ సద్గురు మందిరంలో యాజ్ఞవల్క్య జయంతిని సోమవారం వైభవంగా నిర్వహించారు. యాజ్ఞ వల్క్య జయంతి కమిటీ అధ్యక్షులు పొన్నా కృష్ణబాబు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ లింగాల శ్రీనివాసశర్మ, శ్రీరెడ్డి సూర్యప్రకాష్‌శర్మ పర్యవేక్షణలో గురుపూజ, సూర్య నమస్కారాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ తుట్టగుంట భైరవమూర్తి, సింహాచలం అన్నవరం దేవస్థాన వేద పండితులు నాగవెంకట సురేష్ శర్మ, విష్ణుబొట్ల హనుమంతు వేదస్మార్త పండితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పండితులు పొన్నా రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, రాజారామ్, జగన్నాథ శర్మ, నాగదేవర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హృదయాలయానికి నిత్యావసరాల అందజేత



నిత్యావసర సరకులు అందిస్తున్న రొటేరియన్లు

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల పాఠశాల (హృదయాలయం)కు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరకులు అందజేశారు. చెన్నా రాము, నాగమణి దంపతుల ఆర్థిక సహకారంతో క్లబ్ వాటిని అందజేసింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొర్లేపర వెంకట రత్నకుమార్, ఈ.రాంబాబు, జి.వెంకటేశ్వర రావు, చిలకల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నల్లజర్ల ఏడీఈగా శివప్రసాద్

నల్లజర్ల: విద్యుత్ శాఖ నల్లజర్ల సెక్షన్ ఏడీఈగా మతుకుమిల్లి శివప్రసాద్ నియమితులయ్యారు. మొగల్తూరులో ఏఈగా పని చేస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడకు వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నల్లజర్ల సబ్ ఇంజనీర్, ఇన్‌చార్జ్ ఏఈ ఎంవీ రమణ, అనంతపల్లి ఏఈ బాపిరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్లు గంగాధర్, బాషా, వీఎస్ఎన్ రాజు, ఈదా డేవిడ్, లైన్‌మన్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శివప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

చాగల్లు: ఇద్దరు విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ చాగల్లులో సోమవారం ఉపకార వేతనాలు అందించింది. హైదరాబాద్‌కు చెందిన జగతి ఫౌండేషన్ సేవాసంస్థ ద్వారా ఈ సాయం చేసింది. మండలంలో 6వ తరగతి చదువుతున్న గుర్రం విజయేంద్రకు రూ.10 వేల స్కాలర్‌షిప్ మొదటి విడతలో భాగంగా రూ.5 వేలను ఆ సంస్థ మేనేజర్ దుర్గా కల్యాణి చేతుల మీదుగా అందజేశారు. అలాగే రెండో తరగతి చదువుతున్న మరో విద్యార్థి జి.ధర్మేంద్రకు మండలం మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆళ్ల రామారావు చేతుల మీదుగా రూ.10 వేల స్కాలర్‌షిప్‌లో మొదటి విడతలో భాగంగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ జుజ్జవరపు వెంకటకృష్ణ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు సోమవారం తెలిపారు. కోరుమామిడి గ్రామానికి చెందిన దెయ్యాల పవిత్రకు గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన నరేంద్రబాబుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల తన భర్త నరేంద్రబాబుతో పాటు అతని కుటుంబ సభ్యులు తనను కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు పవిత్ర ఇచ్చిన ఫిర్యాదుపై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మెషీన్ అమ్ముతామంటూ రూ.3 లక్షలకు టోకరా

కొవ్వూరు: జాకెట్లు కుట్టే ఎంబ్రాయిడరీ మెషీన్ అమ్ముతామంటూ నమ్మించి పట్టణానికి చెందిన గుల్లపూడి సుప్రియా పద్మ అనే మహిళ వద్ద నుంచి రూ.3 లక్షలు కాజేశారు. ఎంబ్రాయిడరీ మెషీన్ అమ్ముతామంటూ ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన చూసి, ఆ ఫోన్ నంబర్‌తో మాట్లాడితే రూ.3 లక్షలు వారి సూచించిన అకౌంట్ నంబర్‌కు జమ చేసినట్టు సుప్రియా పద్మ పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 25న సొమ్ము జమ చేశామని, వారి ఆచూకీ కోసం ఇన్నాళ్లా వేచి చూశామని తెలిపారు. ఇటీవల ఫోన్ స్విచ్ ఆఫ్ అయి ఉండడంతో ఆమె తమను ఆశ్రయించినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం పాలంగి సబ్ స్టేషన్ పరిధిలోని చివటం గ్రామానికి మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ ఎస్.నారాయణఅప్పారావు సోమవారం తెలిపారు.

అటు వరి కోతలు.. ఇటు పొగాకు నాట్లు

- మెట్ట ప్రాంతంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు
- కూలీలకు ఉపాధి కల్పిస్తున్న రైతులు



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో వేస్తున్న పొగాకు నాట్లు



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో జరుగుతున్న వరి కోతలు

దేవరపల్లి: వాతావరణం అనుకూలించడంతో మెట్ట ప్రాంతంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. మొన్నటి వరకూ వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడ్డ కూలీలు ప్రస్తుతం ఉపాధి పొందుతున్నారు. వరి కోతలు, ధాన్యం ఆరబెట్టడం, పొగాకు నారు తీతలు, పొగాకు నాట్ల పనులు జోరందుకున్నాయి. వాతావరణం మబ్బుగా ఉండడంతో రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు కోసి ధాన్యాన్ని రోడ్ల పైకి తెచ్చి ఆరబెడుతున్నారు. అనంతపల్లి, సూర్యనారాయణపురం, యర్నగూడెం, కృష్ణంపాలెం, దుద్దుకూరు, గౌరీపట్నం, ఐ.పంగిడి, కొవ్వూరు గ్రామాల్లో కోసిన ధాన్యాన్ని జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఆరబెడుతున్నారు. రెండు రోజుల అనంతరం ధాన్యాన్ని బస్తాల్లో పట్టి మిల్లులకు తరలిస్తున్నారు.

దాదాపు 25 వేల హెక్టార్లలో పొగాకు సాగు

మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేస్తున్న వర్జీనియా పొగాకు నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒకపక్క నారుమడుల్లో నారుతీత పనులు, మరొకపక్క నాట్ల పనులు జరుగుతున్నాయి. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 24,776 హెక్టార్లు కాగా, దాదాపు 25 వేల హెక్టార్లలో సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు 4 వేల హెక్టార్లలో నాట్లు వేసినట్టు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురవడం, అక్టోబరులో రెండు తుపానులు సంభవించడంతో పొగాకు నాట్లు ఆలస్యంగా ప్రారంభించారు. సుమారు 20 రోజుల ఆలస్యంగా నాట్లు జరుగుతున్నాయని బోర్డు అధికారులు తెలిపారు. 2024-25 పంట కాలానికి బోర్డు అనుమతించిన దానికంటే అధికంగా పంట సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పొగాకు రైతులు దూకుడు తగ్గించుకుని ఇతర పంటలు సాగు చేసుకొంటే పొగాకు పంటకు మనుగడ ఉంటుందని సూచిస్తున్నారు.

కూరగాయల పంటల సాగు

నీటి వసతి లేని భూముల్లో రైతులు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. కూరగాయలకు మార్కెట్లో గిట్టుబాటు ధర పలకడంతో రైతులు వాటి సాగునకు మొగ్గు చూపుతున్నారు. వంగ, కాకర, టమోటా, పచ్చిమిర్చి, ఆనప, దొండ, బెండ వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

ఉచిత ఇసుకకు అనుమతి తప్పనిసరి



పెండ్యాల ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

నిడదవోలు రూరల్: ఉచిత ఇసుక కోసం ర్యాంపులకు వచ్చే ట్రాక్టర్ డ్రైవర్లు తప్పనిసరిగా సచివాలయం అనుమతి పత్రం తీసుకు రావాలని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సూచించారు. మండలంలోని పెండ్యాల ఇసుక ర్యాంపును సోమవారం ఆయన పరిశీలించారు. ఇసుక లోడింగ్ విధానంతో పాటు వసూలు చేస్తున్న ధరలపై లారీ డ్రైవర్లతో మాట్లాడారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజూ ఆర్టీసీ కార్మికుల ధర్నా



కొవ్వూరులో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కొవ్వూరు: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ వైఖరిని నిరసిస్తూ కార్మికులు చేపట్టిన ధర్నా రెండోరోజు సోమవారం కూడా కొనసాగింది. నరసాపురం రూట్‌లో మార్పుల విషయంలో డిపో మేనేజర్ వైఖరిని నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన తెలుపుతున్నారు. సోమవారం మధ్యాహ్నం గేటు మీటింగ్ నిర్వహించి మేనేజర్ వైఖరికి నిరసనగా ధర్నా నిర్వహించారు. ఎనిమిది రోజుల నుంచి పలుమార్లు వినతిపత్రాలు అందించామని, నోటీసు ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో డీఎం ఏకపక్ష వైఖరిపై నిరసన తెలియజేస్తున్నామని నాయకులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, డీఎం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. డిపో కార్యదర్శి ఏ.రాజు, డిపో చైర్మన్ సీహెచ్ రమణ,వై బాబు రావు, కె.రమణ, రీజినల్ ప్రెసిడెంట్ ఎస్‌డీ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

- మధ్యాహ్నం వరకూ వేచి ఉన్న ప్రజలు
- అప్పటికీ రాకపోవడంతో ఇంటిముఖం
- నిడదవోలు మున్సిపాలిటీ తీరు



మున్సిపల్ ఆఫీసులో ప్రజా సమస్యల పరిష్కార ప్రజా వేదికలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

నిడదవోలు: ప్రజల నుంచి వినతులు స్వీకరించే అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నాటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెలబోయింది. తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ అర్జీలు ఇచ్చేందుకు ఉదయం 10 గంటలకు నిడదవోలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న వారు మధ్యాహ్నం 12:40 గంటల వరకూ వేచి ఉన్నారు. ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడానికి మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బి.వెంకటేశ్వరరావును అధికారులు నియమించారు. తాడేపల్లిగూడెంలో నివాసం ఉండే ఆయన ఉదయం 10:30 గంటలకు ఆఫీసుకు వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి బయటకు వెళ్లిపోయాడు. కనీసం పర్మిషన్ కూడా తీసుకోలేదని సమాచారం. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి సెలవులో ఉండడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా డీఈఈ సత్యనారాయణ బాధ్యతలు తీసుకున్నారు. అధికారులు కానీ సిబ్బంది గానీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక కౌంటర్లో లేకపోవడంతో అర్జీలు సమర్పించేందుకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12.40 వరకూ ఓపికగా ఎదురు చూసిన అర్జీదారులు సహనం నశించడంతో ఇంటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఒక అర్జీ కూడా తీసుకోలేదు. ఈ క్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

దీనిపై ఇన్‌ఛార్జి కమిషనర్ సత్యనారాయణను 'సాక్షి' వివరణ కోరగా, ఆయన పొంతన లేని సమాధానం చెప్పుకొచ్చారు. పట్టణంలో మంచినీటి సమస్య ఉంటే తాను అక్కడకు వెళ్లానని సమాధానం చెప్పారు. ఇంజినీరింగ్ విభాగంలో ఏఈ హేమంత్‌కుమార్‌తో పాటు పలువురు కింది స్థాయి ఉద్యోగులు పని చేస్తున్నారు. మంచినీటి సమస్య ఉంటే వారిని పంపించాల్సింది పోయి ప్రజా సమస్యల పరిష్కార వేదికను గాలికి వదిలేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో సాక్షులే కీలకం

- సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ పర్వీన్
- ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై కొవ్వూరులో అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ పర్వీన్

కొవ్వూరు: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసినప్పటికీ ట్రయల్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పక పోవడంతో నిందితులకు శిక్షలు పడడం లేదని రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) అడిషనల్ ఎస్పీ అస్మ పర్వీన్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై సోమవారం స్థానిక సుందరసాయి కల్యాణ మంటపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఎస్పీ అస్మ పర్వీన్ మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యులు ధైర్యంగా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, ఈ చట్టం వల్ల వాటి నుంచి ఏవిధంగా రక్షణ లభిస్తుందో వివరించారు. ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, అమలయ్యే శిక్షల గురించి కూడా వివరించారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉద్యోగి పెనుమాక జయరాజు తన ప్రసంగంలో స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తర్వాత ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి వివరించారు. రిటైర్డు సీనియర్ పీపీ గోపాలరావు మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం నిర్మూలనకు ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ గురించి, అట్రాసిటీ యాక్ట్ గురించి వివరించారు. అట్రాసిటీ చట్టం పరిధిలో జరిగే నేరాలు, చట్టం అమలు గురించి, స్పెషల్ కోర్టు గురించి అవగాహన కల్పించారు. బాధితులు కు ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విధానంతో పాటు సదస్సుకు హాజరైన వారు అడిగిన సందేహాలను నివృతి చేశారు. పట్టణ సీఐ పి.విశ్వం, రిటైర్డ్ సీఐ కె.సాల్మన్‌రాజు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 గురించి వివరించారు. అనంతరం ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించారు. దీనిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి మెమొంటోలు అందజేశారు. రాజమహేంద్రవరం సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ ఎం.సందీప్, సీనియర్ పీపీ కె.గోపాలరావు, ఎంపీడీవో కె.సుశీల, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మేరీమాత, మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలకు రూ.50 వేల చొప్పున జరిమానా

కొవ్వూరు: బిల్లులు లేకుండా మండలంలోని వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి మూడు లారీలతో అక్రమంగా ఇసుకను తరలించగా, ఒక్కొక్క లారీకి రూ.50 వేల చొప్పున అపరాధ రుసుము విధించినట్టు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. ఈనెల 2న ఆర్డీవో రాణి సుస్మిత ఆకస్మికంగా వాడపల్లి గ్రామ సమీపంలో లారీలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూడు లారీలు ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు ఆర్డీవో గుర్తించారు. మూడు లారీలను సీజ్ చేసి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.సోమవారం మూడు లారీలకు అపరాధ రుసుము విధించారు.లారీల్లో ఉన్న ఇసుకను రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో పనుల నిమిత్తం తరలించారు.

రీచుల్లో అదనపు వసూళ్లను ఉపేక్షించం

- ఆర్డీవో రాణి సుస్మిత
- పలు ఇసుక ర్యాంపుల తనిఖీ
- లారీ యజమానుల ఫిర్యాదుపై విచారణ



కొవ్వూరు దండగుండ రేవు ఇసుక ర్యాంపులో విచారణ జరుపుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: స్థానిక ఎరినమ్మ, దండగుంట ఇసుక ర్యాంపుల్లో బాట చార్జీల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ కొవ్వూరు లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం తాను ఇసుక ర్యాంపులను తనిఖీ చేసినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. లారీ ఓనర్స్ రూ.4,800, రూ.3,480 చొప్పున ఫోన్ పే చేసినట్టు చూపించారన్నారు. ఆ సొమ్ము లారీలకు నిర్వహణ ఖర్చుల కింద చెల్లించే మొత్తంగా నిర్ధారణ అయ్యిందన్నారు. ఎరినమ్మ ర్యాంపుల్లో వైజాగ్‌కు చెందిన లారీ డ్రైవర్ తాను రెండు రోజుల నుంచి ఇసుక కోసం వేచి ఉన్నట్లు చెప్పారన్నారు. పూర్తిస్థాయిలో ఇసుక ఉత్పత్తి లేకపోవడంతో సోమవారం సాయంత్రం ఆ లారీకి లోడింగ్ చేయించుకున్నారని, దానిలో రాళ్లు, మట్టి వచ్చిందని ఆరోపించారన్నారు. లోకల్, నాన్ లోకల్ లారీలంటూ వివక్షత చూపించడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్టు లారీ డ్రైవర్లు చెబుతున్నారన్నారు. దండగుంట రేవుకు ఏడు లారీలు వస్తే నాలుగు లారీలకే ఇసుక ఇచ్చారని డ్రైవర్‌లు ఆరోపించగా, మిగిలిన మూడు లారీలకు కూడా ఇసుక ఇవ్వాలని ఆదేశించామని ఆర్డీవో చెప్పారు. అదనపు సొమ్ముల వసూళ్లపై అన్ని ఇసుక ర్యాంపుల్లో ఆరా తీశామని ఆమె తెలిపారు. అదనపు సొమ్ములు వసూలు చేస్తున్నట్టు ఏ ర్యాంపులోనూ ఫిర్యాదులు అందలేదన్నారు. వాడపల్లి, ఔరంగాబాద్, ఎరినమ్మ, దండగుండ ఇసుక ర్యాంపులను తనిఖీ చేసినట్టు ఆర్డీవో తెలిపారు. తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, ఇతర అధికారులు ఆమె వెంట ఉన్నారు.

అండగా ఉంటాం .. ధైర్యంగా ఉండండి

- మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ భరోసా
- తాడిపర్రు విద్యుదాఘాతం మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ఉండ్రాజవరం: కుటుంబాలకు ఆధారమైన యువకులు విద్యుదాఘాతంతో మృతి చెందడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా మండలంలోని తాడిపర్రు గ్రామంలో ఇటీవల ఫ్లెక్సీలు కడుతూ విద్యుదాఘాతానికి గురై నలుగురు మృతి చెందిన విషయం తెలిసింది. మృతులు బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసకాని కృష్ణ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరామర్శించారు. అదే ఘటనలో గాయపడిన కోమటి అనంతరావు ఆరోగ్య పరిస్థితిని వారు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు పార్టీపరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పి ఓదార్చారు. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున శ్రీనివాస్‌నాయుడు ఆర్థిక సహాయం అందించారు. అలాగే తీవ్రంగా గాయపడిన అనంతరావుకు కూడా రూ.10 వేలు సాయంగా అందించారు. వైద్యపరంగా ఏ అవసరం వచ్చినా తన వద్దకు రావచ్చని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, తాడిపర్రు ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తాడిపర్రు గ్రామ శాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, ఆ పార్టీ పెరవలి మండల శాఖ అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాల్దారిలో తాటాకిల్లు దగ్ధం

ఉండ్రాజవరం: కాల్దారి గ్రామంలో సోమవారం నాలుగు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిన ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా. ఆ తాటాకింట్లో చింతల రామారావు, అయన కుమార్తె వి.మంగ, చింతల లక్ష్మణరావు, ఆయన కుమారుడు నర్సింహమూర్తి అనే నాలుగు కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని నిడదవోలు ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసు పి.ప్రసాద్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫర్నిచర్‌తో పాటు వస్తువులన్నీ పూర్తిగా కాలిపోవడంతో నాలుగు కుటుంబాల వారూ నిరాశ్రయులయ్యారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యం అందజేసినట్టు వీఆర్వో పోలయ్య తెలిపారు.

వాలీబాల్ టోర్నీలో జిల్లా బాలికలకు మూడో స్థానం

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ అండర్ -14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు తృతీయస్థానం సాధించిందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఈనెల 9 నుంచి 11 వరకూ విజయనగరం జిల్లా భోగాపురంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో జిల్లా బాలికల జట్టు తృతీయ, బాలుర జట్టు నాలుగో స్థానం సాధించినట్టు కొయ్యల ప్రసాద్ తెలిపారు. విజేతలను పలువురు అభినందించారు.

శివోహం.. భక్తజన సందోహం

- ఘనంగా కార్తిక సోమవారం పూజలు
- ముక్కంటికి అభిషేకాలు



అన్నవరప్పాడులో ఉమా విశ్వేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



గోష్పాద క్షేత్రంలో గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



బ్రాహ్మణగూడెంలో సుందరంగా అలంకరించిన బాలరామలింగేశ్వరస్వామి



చాగల్లులో రాజరాజేశ్వర స్వామి వారు

నిడదవోలు రూరల్: శివునికి ప్రీతికరమైన కార్తిక మాసంలోని రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివ నామ స్మరణతో మార్మోగాయి. మండలంలోని శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తాడిమళ్లలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, రామలింగేశ్వరస్వామికి, కాటకోటేశ్వరంలో ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామికి, కంసాలిపాలెంలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాట కోటేశ్వరంలో ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉనకరమిల్లిలోని ఉమా లింగేశ్వరస్వామి, సమిశ్రగూడెంలోని పర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

పెరవలి: అన్నవరప్పాడులోని ఉమా విశ్వేశ్వరస్వామి వారికి వందలాది భక్తులు అభిషేకాలు నిర్వహించారు. మల్లేశ్వరంలోని స్వయంభు కపిల మల్లేశ్వరస్వామి వారికి అధిక సంఖ్యలో మహిళలు అభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఖండవల్లిలోని మార్కండేయ మృఖండేయ స్వామి, ముక్కామలలోని ఉమా సోమేశ్వరస్వామి, కాపవరంలోని ఉమారామలింగేశ్వరస్వామి, తీపర్రులో రాజ రాజనరేంద్ర స్వామి ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి ఒంటి గంటకు ప్రారంభమైన అభిషేకాలు ఉదయం 10 గంటల వరకూ కొనసాగాయి.

గోష్పాద క్షేత్రానికి కార్తిక శోభ

కొవ్వూరు: కార్తిక సోమవారం కావడంతో స్థానిక గోష్పాద క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో క్షేత్రం కళకళలాడింది.కుటుంబ సమేతంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నది ఒడ్డు పూజలు చేసి నదిలో కార్తిక దీపాలు విడిచి పెట్టారు. స్నాన ఘట్టంలోని శివలింగానికి గోదావరి జలాలతో భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం బాలా త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయం, పంచాయతన శివాలయం, పాతూరులోని ఉమా చోడేశ్వర స్వామి ఆలయం, దొమ్మేరుగ్రామంలోని ఉద్దండ మల్లికార్జున స్వామి, వాడపల్లిలోని శివాలయంలోను ప్రత్యేక పూజలు చేశారు.

చాగల్లు: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని చాగల్లు రాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. చిక్కాల, కలవలపల్లి, ఊనగట్ల, మార్కొండపాడు ఉమామార్కండేయ స్వామి వార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.